
# కరిగిన స్వర్గం

ఘండికోట బ్రహ్మాజీరావు

వాళ్ళో చిన్న స్వర్గం నిర్మించుకున్నారు.
స్వర్గమంటే ఏమిటి?

ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టడానికి బట్ట, చదువుకోడానికో మంచిపుస్తకం — ఇవి చాలా మందికి అందుబాటులో వుంటాయి. వీటికన్నా ఎన్నోమంచి సదుపాయాలు జరిగినా గర్వం, పొగరు, మోతుతనం, ఒంటరితనం ఇలాంటివి స్వర్గాన్ని కూడా నరకం చేస్తాయి.



మనవాళ్ళు నిర్మించుకున్న స్వర్గం చాలా మంచి పునాదుల మీద లేచింది. వాళ్ళు ఒకరితో ఒకరు జట్టీలు పడరు — ఒకరంటే ఒకరు అభిమానపడతారు. అందులో ఒకరు పెద్ద అంతస్తులో వున్నాడని, మరొకరు చిన్నవాళ్ళని భేదం కూడా వాళ్ళకి తెలీదు.

అయినా ఆ ఇల్లు స్వర్గమని చెప్పడానికి ఎలా వీలవుతుంది? (అక్కడ మంచి నరకానికి మారిపోయే టప్పుడు వాళ్ళు మనమున్నది స్వర్గమేనని నమ్ముతారు.)

ఈ స్వర్గం ఎక్కడో లేదు.

స్టేషనుకి, సిటీ బస్సు స్టాపుకి నూరు గజాల దూరంలో వుంది. రామాలయానికి, కూరల బజారుకి దగ్గరలో వుంది. బడులకు, కాలేజీలకు పోవడానికి ఇబ్బంది అక్కరలేదు. అన్నిటికన్నా ముఖ్యం కాఫీ హోటళ్ళు, సినిమా థియేటర్లు —- ఇవన్నీ చాలా దగ్గరే.

ఇంతకీ ఆ స్వర్గసీమ విజయవాడ మహానగరంలో సత్యనారాయణపురం స్టేషన్‌కి నూరు గజాల దూరంలో వుంది.

ఆ ఇల్లు తూర్పు దిక్కుగా వుంది. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ, పెద్ద గేటు వున్నాయి. గేటు తలుపు తెరవగానే ఇరవై అడుగుల స్థలం విడిచిపెట్టి వుంది. ఎదురుగుండా పెద్ద హాలు, రెండు పడక గదులు, వంట గది, భోజనాల గది, స్టోరు రూము వున్న పెద్ద వాటా వుంది. అందులో ఎవరో పెద్ద అద్దెలిచ్చే ఆఫీసర్లు సంవత్సరమో, ఆరు నెల్లో వుండి బదిలీ అయిపోగానే ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతుంటారు. కాబట్టే వాళ్ళని ఈ స్వర్గంలోని వాళ్ళుగా గుర్తించడం లేదు. పెద్ద వాటాకు ఆనుకొని దక్షిణంవేపు ముందు వాటా వుంది. దానిలో రెండు గదులున్నాయి. రెండూ ఒకే సైజువి — పదడుగుల వెడల్పు, పన్నెండు అడుగుల పొడవు వున్నాయి. ఆ వాటాలో ఎనిమిది సంవత్సరాల కింద రైల్వేలో పనిచేసి రిటైరయిన రంగారావుగారు, వారి భార్య మంగమ్మగారు, వారి పెళ్ళికావలసిన అమ్మాయి శాంత వుంటున్నారు. ముందు గది పడకలకి, వెనక గది భోజనాలకి ఉపయోగిస్తున్నారు.

ఆ వాటా వెనుకనే ఆదిత్య వాళ్ళు వుంటున్నారు — ఆదిత్య అంటే మగ పేరు కాదు - మగవాళ్ళతో సాటిగా ఉద్యోగం చేస్తున్న అమ్మాయి. బి.కామ్. పాసయింది. ఆమె కన్నా పెద్దవాడు సుబ్బారావు. మనిషి పూర్తిగా అమాయకుడు. అతనికి ఇరవై ఎనిమిది సంవత్సరాలు వచ్చాయి. హైస్కూలు చదువు కూడా సరిగా లేనందున అతనికేం గవర్నమెంటు నౌకరీ దొరకలేదు. వాళ్ళ నాన్నగారి ఆఫీసులో వాళ్ళు రిక్రియేషను క్లబ్బు పెట్టి అందులో సుబ్బారావుకి అటెండర్ ఉద్యోగమిచ్చి నెలకో ఏడు వందల ఏభై ముట్టజెప్తారు. అతని చెల్లెలు ఆదిత్యకో అయిదు వందలు ప్రైవేటు కంపెనీవాళ్ళిస్తారు. ఈ యిద్దరు పిల్లలను పెట్టుకొని వాళ్ళ అమ్మగారు ఆరు సంవత్సరాల క్రింద ఈ ఇంట్లో వచ్చి దిగారు. ఆవిడది కొంచెం స్థూలమైన వొళ్ళు. పైగా మోకాళ్ళ నొప్పులు. మనిషి సహాయం లేంది నడవ లేదు. ఉదయం ఎవరూ లేవకముందే పెరటి వాకిట్లో స్నానం చేసుకొని తనమానాన్న తను పడుకుంటారు. వారానికోసారి డాక్టర్ దగ్గరకు వెళ్ళిరావడానికి ప్రళయమవుతుంది. ఇద్దరు మనుష్యులు ఆసరా ఇచ్చి ఆమెను రిక్షాలో కూర్చోపెడతారు. వచ్చేటప్పుడు అదే తంతు. ఎవరు ఇంట్లో వున్నా లేకపోయినా ఆవిడ మాత్రం దొరుకుతారు. వాళ్ళ వాటా చిన్నదే. ఒక పడక గది, చిన్న సంచ. అదే వాళ్ళకి భూతల స్వర్గం.



అన్నిటికన్నా మూడో వాటా (లేక నాలుగో వాటా) చాలా చిన్నది. పన్నెండడుగుల పొడుగు, ఎనిమిది అడుగుల వెడల్పు వున్న నసారాకే తలుపు. ద్వారబంధం పెట్టినట్లుంది. దానికి కిటికీలు లేవు. వెంటిలేటర్లు లేవు. రెండో పక్క ద్వారం కూడా లేదు. తలుపు తీస్తే వెలుతురు, లేకపోతే చీకటి. అందులో రెండేళ్ళ కింద చిన్న సెట్టిగారు కుటుంబంతో వచ్చి దిగారు. సాధారణంగా వైశ్యులంటే సంపన్నులని అనుకుంటారు. కాని, అందుకు భిన్నంగా అతను చాలా సామాన్యస్థితిలో వున్నారు. అతని భార్య చాలా మంచి మనిషి. ఆవిడే అతని సంపద. వాళ్ళ పిల్లలు ముగ్గురూ ఆడపిల్లలయితేనేం రత్నమాణిక్యాలే!

రంగారావుగారు ప్రతి ఉదయం మూడు గంటలకి నిద్రలేచి పువ్వులు తేడానికి వెడతారు. వీథిలో ఎవరి పెరళ్ళలో వున్న చెట్టు కొమ్మలు పైకి వస్తే నంది వర్ధనం పువ్వులు, రాలిన పారిజాతం పువ్వులు తీసుకు వస్తారు. తెచ్చిన పూలన్నీ లెక్కపెట్టి భద్రంగా వుంచు తారు. మరొక పావుగంటలో పాల మనిషి పాల పొట్లాం ఇంట్లో పడేసి వెళ్ళిపోతుంది. తరువాత పనిమనిషి అంట్లు తోమడానికి వచ్చి గుమ్మాలు కడిగి ముగ్గులు పెడుతుంది. ఆసరికి అతని భార్య మంగమ్మగారు లేచి కార్యాలు తీర్చుకుని స్నానం చేసి కుళాయినీళ్ళు నింపడం మొదలుపెడతారు. ఉదయం ఆరు గంటలయ్యేసరికి వాళ్ళమ్మాయి శాంతి లేచి తన పనులు పూర్తిచేసుకుని ఎనిమిదిన్నరకి తయారయేసరికి, రంగారావుగారు కూడా కూతురుతోపాటు భోజనం చేస్తారు. మంగమ్మగారు భోజనం చేసేసరికి పదకొండు కావస్తుంది. వీథిలో వున్న బడ్డీ దుకాణం నుంచి అద్దెకి తెచ్చిన నవల రంగారావుగారు చదివి తరువాత మధ్యాహ్నం వేళ విశ్రమిస్తారు.

ఆదిత్యగారింట్లో ఉదయం దగ్గర నుండి సంరంభమే. ఎనిమిది గంటలకు సుబ్బారావు ఏదో తిని ఉద్యోగానికి వెళ్ళిపోతాడు. ఆదిత్య తొందరగా వంట చేసి ఎనిమిదిన్నరకి భోజనం చేసి ఉద్యోగానికి వెళ్ళిపోతుంది. వాళ్ళమ్మగారు తరువాత భోజనం చేసి బడ్డీ దుకాణం నుంచి తెచ్చిన నవల చదువుకుంటూ పడుకుంటారు.

చిన్నసెట్టిగారి గురించి చెప్పడానికి చాలా వుంది. ఆయన వైశ్యుల కుటుంబానికే చెందినా, లక్ష్మీదేవి మాత్రం వాళ్ళింటి గడప తొక్కడానికి మొహమాట పడుతుంది. స్వతంత్రంగా కిరాణా దుకాణం పెట్టుకొని వ్యాపారం చేయడానికి బదులు అతను ఒక పెద్ద కిరాణా దుకాణంలో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి వచ్చే ఆదాయం ఇల్లు గడవడానికి ఏం సరిపోతుంది? అందు చేత అతని భార్య కొంచెం దూరంలోనే ఒక బడ్డీ దుకాణం నడుపుతోంది. మొగుడు పెళ్ళాలు ఈ విధంగా శ్రమపడుతూ వున్నదానిలోనే సంసారం గడుపుకుంటూ మాణిక్యాలలాంటి ముగ్గురు పిల్లలని పెంచు

కొని వస్తున్నారు. పగలు ఏదో విధంగా గడిచిపోతుంది. కాని రాత్రి ఆ గది అందరూ పడుకోడానికి చోటివ్వదు.

పెరట్లో ఇనప మంచం వేసి దాని మీద ఇద్దరు పిల్లల్ని పడుకోబెట్టి, తాను మాత్రం వాలు కుర్చీలో పడుకొని రాత్రి గడిపేస్తారు. గాలి, వెలుతురులు లేని గదిలో సెట్టిగారి భార్య, వాళ్ళ పెద్దమ్మాయి పడుకుంటారు. వర్షాకాలంలో వాళ్ళందరూ ఆ గదిలో కిక్కిరిసిన రెండో తరగతి రైలు పెట్టెలోని ప్రయాణీకులకు మల్లే గడుపుతారు. చలికాలం సరేసరి.


వచ్చిన కొత్తలో ఒక కుటుంబం వాళ్ళకి మరో కుటుంబంవాళ్ళకి అభిప్రాయ భేదాలు వస్తూవుండేవి. చిన్న చిన్న మాట పట్టింపులు వుండేవి. వాని వల్ల మామూలుగా గడపవలసిన నిత్య జీవితంలో ఒడిదుడుకులు ఏర్పడి వాతావరణంలో అశాంతి కనిపించేది. అది వాళ్ళందరూ గ్రహించినట్టున్నారు. అందరూ ఒకే కుటుంబంలో బంధువులుగా కలిసి మెలిసి వుంటూ ఆ ఇంటిని భూతల స్వర్గం అని పిలిచారు. సెట్టిగారి పిల్లలు రంగారావుగారిని తాతగారని, మంగమ్మగారిని బామ్మగారని, సుబ్బారావుగారి తల్లిని అమ్మమ్మగారని పిలిచి స్కూల్లో చెప్పిన ఇంగ్లీషు రైమ్స్ వాళ్ళకి వినిపించి సందడిగా వుండేవారు.

ఆదిత్య ఉదయం ఎనిమిదిన్నరకి పోతే తిరిగి ఏ రాత్రో వచ్చేది. ఎకౌంట్స్ క్లర్క్‌గా కంపెనీలో పని చేస్తూ బండెడన్ని బేలన్స్ షీట్లు ఇంటికి తెచ్చుకొనేది. ఏ రాత్రో పన్నెండు గంటల వరకు సరిపడినవి సరిపోగా మిగిలినవాటిని రంగారావుగారి మీద పడేసి "మావయ్యగారూ! కొంచెం చూడండి. ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా ఇవి సరిపడి చావడం లేదు" అనేది. అతను ఆరోజు నవల చదవడం మానేసి ఆదిత్య తెచ్చిన పని పూర్తిచేసేవారు.

ఇక శాంతి సంగతి చెప్పాలంటే ఆ పిల్లకి అట్టే పని వుండేది కాదు. ఆమె సాయంకాలం ఐదింటికే వచ్చేసేది. ఆమె తల్లికి సాయం చేసో, బజారుకి పోయి సామాన్లు తెచ్చో కాలం గడిపేది. సెలవు దొరికితే ఆదిత్యతో కలిసి విధిగా సినిమాకి వెళ్ళేది. ఏ పర్వానికో, పండుగకో ఇద్దరు స్నేహితురాండ్రు రామాలయానికి వెళ్ళి వచ్చేవారు.

ఇంట్లో ఈ మూడు వాటాలకి కాపుగా ఆదిత్య అమ్మగారు వుండేవారు. సుబ్బారావు మధ్యాహ్నం భోజనానికి వచ్చి నాలుగు గంటలకి ఉద్యోగానికి పోయేవాడు. మళ్ళా రాత్రి ఏ పదికో వచ్చి భోజనం చేసి ఆరుబయట మంచం వేసుకొని పడుకొనేవాడు.

వచ్చిన కొత్తలో చిన్నసెట్టిగారికి పెద్ద చిక్కు వచ్చి పడింది. బడ్డీ దుకాణం కోసం చక్కిలాలు, సున్నుండలు మొదలయినవి కొనుక్కొచ్చి పొట్లాల్లో వుంచుకుంటే బిలబిలమని ఆ వాటాల్లోని ఎలుకలన్నీ వచ్చి తినిపోతుండేవి. దాంతో అతనికి వెర్రెత్తినట్లయింది. ఏం చేయడమో బోధపడడంలేదు. రెండు వారాల్లో రమారమి ఏభై రూపాయిల వరకు సామాను నష్టపోవడంతో అతనికి మతిపోయింది. అప్పుడు ఈ ఎలకల్ని చంపడం తప్పని సరి అయింది. చిన్న సెట్టిగారు వచ్చిన తరువాత ఎలుకల బాధ ఈ విధంగా తొలగిపోయింది.



ఇటువంటి భూతల స్వర్గం మీద జనవరి ముప్పై ఒకటవ తారీఖున మధ్యాహ్నం పూట ఆకాశం మీద నుండి కూలినట్టు ఆటంబాంబు ఒకటి పడ్డది. ఆ క్షణంలో ఆ స్వర్గం తునాతునకలయిపోయింది.

ఇంతకాలం ఆ మూడిళ్ళవాళ్ళకి ఇంటి యజమాని ఎవరో తెలీదు. ప్రతి నెల అద్దె వాళ్ళ తమ్ముడిగారికి ఇవ్వడమే వాళ్ళకి తెలుసు. దిగినప్పుడు చెల్లించిన అద్దె కన్నా ఇప్పుడు రెండున్నర రెట్లు అధికంగా చెల్లించినా, ఎందుకీ ఆకస్మికమైనటువంటి సంక్షోభం కలిగింది?

మూడు వాటాల వాళ్ళకి మూడు కార్డులు వచ్చాయి.

ఇంటి యజమాని మే మొదటి వారంలో ఉద్యోగం నుంచి రిటైరయిపోతున్నాడని, ఈ కార్డును మూడు నెల్ల నోటీసుగా భావించి మే ఒకటవ తారీఖు సాయంత్రానికల్లా అన్ని వాటాలవాళ్ళు ఇల్లు ఖాళీ చేయమని ఆదేశం వచ్చింది. అంతవరకు కళకళలాడుతున్న అందరి ముఖాలలోను ఒక్కసారిగా కత్తివేటుకి కూడా నెత్తురు చుక్క కనిపించలేదు. ఏదో ఉపద్రవం వచ్చి ఏమి చేయడమో తెలియకుండా మనుషులంతా గుమిగూడి నట్టు వాళ్ళు సాయంకాలం చాపలు వేసుకొని కూర్చున్నారు.

'ఏం చేయడం? ఎక్కడికి వెళ్ళడం?' అన్న మాటలు తప్ప మరేవీ వినిపించలేదు. రంగారావుగారింటికి ప్రతి నెల విడవకుండా గుంపులుగా చుట్టాలు వచ్చి ఒక్కపూటైనా భోజనం చేయందే వెళ్ళరు. ఆ ఇల్లాలు బంధుప్రీతితో వచ్చిన వాళ్ళందరికీ వండిపెట్టి మర్యాదగా సాగనంపుతుంది. ఆ ఇంట్లోనే వాళ్ళ ఆడపిల్లలు పురుళ్ళుపోసుకుని, సుఖంగా చంటిపిల్లల నెత్తుకొని వెళ్ళిపోయారు. చీకూ చింతా లేకుండా రేపటికి ఏమవుతుందోనని ఆందోళన లేకుండా కలిగినది తింటూ, మనసుకు వచ్చింది చదువుకుంటూ, వీలయితే సత్కాలక్షేపం చేసి, లేకపోతే ఆవరణలో వున్న అశోక వృక్షం కింద మంచం వేసుకొని విశ్రాంతిగా వుండడం రంగారావుగారికి అలవాటయిపోయింది. అటువంటి ప్రశాంతమయిన వాతావరణం ఇప్పుడు దూరమయిపోతుంది.

ఆదిత్యకి, శాంతికి ఆఫీసులు దగ్గరగా వుండడం, సినిమాలు, బజార్లకి కలిసి వెళ్ళే అవకాశం కలగడం చాలా బావుండేది. ఇల్లు వదిలిపెట్టి వెళ్ళాలనే వార్త తెలియగానే వాళ్ళకి ఏదో చెప్పరాని భయం మనస్సులో నిలిచింది. ఇక సెట్టిగారి సంగతి చెప్పనే అక్కరలేదు.

ఆ సాయంకాలం నుంచీ ఎవరికి వారు వేరువేరుగా, అందరూ కలిసి ఒక గుంపుగా, ఇళ్ళు ఏవయినా ఆ ప్రాంతాలలో దొరుకుతాయేమో అని అన్వేషించడానికి వెళ్ళారు.

ఇరుకుగా వుండే వాటాలు, మురికి కాలవల కంపు, దోమల బెడద ఇవన్నీ ప్రతి వాటాకి అనుబంధమయిన సుగుణాలు. వీటితో ఏదో విధంగా బాధపడినా, ఇల్లుగల వాళ్ళు కోపిష్టులనో, ప్రతి చిన్న పొరపాటుకి పెద్ద గోల చేసేవాళ్ళనో తెలిసి వాళ్ళు వేటినీ విశ్వ యించుకోలేకపోయారు.

ఇంటిగలాయన తమ్ముడు ఈ మధ్యనే చాలా విశాలమయిన ఇల్లు కట్టుకొని గృహప్రవేశం చేశారు. ఇంట్లో వున్న నలుగురికి మూడు పెద్ద గదులు, భోజనశాల, కిచెను, స్టోర్ రూమ్, టి.వి. చూడడానికి చాలా పెద్ద గది వున్నాయి.

ఉన్నట్టుండి ఆదిత్యకు ఒక ఆలోచన తట్టింది.

"శాంతా! మనిద్దరం పై ఇంటాయన దగ్గరికి పోయి, వాళ్ళ టి.వి. గదిని మన రెండు కుటుంబాలకు అద్దెకివ్వమని అడుగుదాం. ఏదో విధంగా మనం కాలం గడపొచ్చు. వాళ్ళు అయిదు వందల వరకు అద్దె అడిగినా, ఇద్దరం కలిసి ఇవ్వగలం కదా!" అంది.

పక్కనే వున్న రంగారావుగారు ఆ మాటలు విని — "ఇంత కాలం మీరు చదువుకున్నవాళ్ళని, తెలివితేటలు

**బ్రేకర్లు**

"రైలు ప్రమాదాలను తగ్గించేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు???"

"రైలు పట్టాల మీద స్పీడ్ బ్రేకర్లు వేయించాలని ఆలోచిస్తున్నాం!!!"

షేక్ కరీముల్లా (బాపట్ల)

వున్నవాళ్ళని వేననుకున్నాను. కానీ, ఇంత బుద్ధి తక్కువగా ప్రవర్తిస్తారని అనుకోలేదు. వాళ్ళందరూ సంపన్నులు. లక్ష్మీదేవికి అనుంగు బిడ్డలు. వాళ్ళ స్నేహితులు వస్తే, వాళ్లతో కలిసి టి.వి. చూడడానికి కట్టించుకున్న గదిలో మనల్ని, మన చింకి చాపల్ని, విరిగిపోయిన మంచాలని వాళ్ళు రానివ్వడానికి సుముఖులుగా వుంటారనే మీ అభిప్రాయమా?" అన్నారు.

రోజులు గడుస్తున్నకొద్దీ ఒక్క ఇల్లు కూడా నచ్చక వాళ్ళు బాధపడుతున్నారు. తిన్న తిండి ఎవరికీ వంట బట్టడం లేదు. ఇల్లెక్కడ దొరుకుతుందనే ఆలోచనలో వెర్రెత్తిపోతున్నారు. చిన్న చిన్న సదుపాయాలు వాళ్ళకి నచ్చి ఈ భూతల స్వర్గం విడువలేక కుమిలిపోయారు.

ఒక్కొక్కప్పుడు శాంత ఓ ప్రశ్న వేసేది.

"నాన్నగారూ! మనం ఇంత ఇబ్బంది పడుతున్నామని ఇంటాయనికి తెలిస్తే బహుశః మరేదో ఇల్లు చూసుకుంటారేమో!"

ఆ మాటలు విన్న రంగారావుగారికి నవ్వాలో, ఏడ్వాలో తెలిసిరాలేదు.

కాలం కొంప మునిగిపోయినట్టు పరుగిడుతూనే వుంది. కేలండరులోని రోజులు దొర్లిపోతూ ఏప్రిల్ నెల పదిహేనవ తారీఖు వచ్చింది. ఆ వేళ రాత్రి మూడు కుటుంబాలవాళ్ళు ఆవరణలో కూర్చొని అంతవరకు చేసిన ప్రయత్నాలన్నీ పునర్విమర్శించుకున్నారు.

రంగారావుగారు చూపిన ఇళ్ళల్లో ఒక్కటి కూడా వాళ్ళకి నచ్చలేదు. అయితేనేం? వాళ్ళ దగ్గరి బంధువులు ఒకరు ఈ మధ్యే ఓ పెద్ద ఇల్లు కట్టించుకున్నారు. అందులో ఒక భాగం అన్ని సదుపాయాలతో వున్నది వాళ్ళకి ఇవ్వడానికి వాళ్ళు ఒప్పుకున్నారు.

వచ్చిన చిక్కల్లా ఆ ఇల్లు శాంత పనిచేసే చోటుకి చాలా దూరంగా వుండడమే. దేవాలయాలు, సినిమా థియేటర్లు, బజారు ఒకటేమిటి అన్నీ శ్రమపడితే కాని దొరకవు. వీటన్నింటికీ ఆయన అట్టే బాధపడలేదు.

అప్పుడు ఆదిత్య అడిగింది—"మావయ్యగారూ! మీ కొచ్చిన ఆటంకం ఏమిటి?"

అప్పుడాయన చిన్న శ్లోకం చదివి అర్థం చెప్పారు.

"పులులు, ఏనుగులు తిరిగే అడవి చాలా మంచిది. వేలను గడ్డి పరచుకొని పడుకోవడంతో తప్పు లేదు. నార చీరలు కట్టుకున్నా ఆనందంగానే వుంటుంది. కానీ బంధువుల మధ్య ధనం లేని జీవితం గడపడం కన్నా


Computerised Composing English & Telugu

**APPLE DESKTOP UNIT**

Best Expertise that Vijayawda Can offer

| | | |
|---|---|---|
| TEXT BOOKS | MAGAZINES | AD MATERIAL |
| GUIDES | SOUVENIRS | AD DESIGNS |
| NOVELS | BROCHURES | PROJECT REPORTS |

with

PRECISE PAGEANT PUNCTUAL PERFECT PRINTING PANORAMA

CONACT : **Ch. RAMESH** MANAGING PARTNER

**Printika**

(A Division of Kennedy Enterprises)

40-9-105 1St FLOOR NEAR BENZ CIRCLE

OLD KENNEDY HIGH SCHOOL CAMPUS VIJAYAWADA 520 008

PHONES: 52174, 52751

నికృష్టమయిన పని లేదు."

అతని మాటలు విని ఎవరూ మరి ప్రశ్నలు వెయ్యలేదు. ఒక పది నిమిషాలు తరువాత అతనే మళ్ళీ అన్నారు.

"ప్రస్తుతానికి ఇంతకు మించి మరే ఇల్లు లేదు. కాబట్టి ఈ ఇంట్లో దిగక తప్పదు."

తరువాత ఆదిత్య తాను చూసిన ఇళ్ళన్నీ గుర్తుకు తెచ్చింది. చాలా ఇళ్ళల్లో వాళ్ళమ్మగారికి కొంచెం కూడా సదుపాయం లభించదు. ఒకటి ఒకటి కాదనుకుంటే ఒక్క వాటా మాత్రం ఒక మాదిరిగా వుంది. ఆ ఇంటావిడకి ఎవరూ లేరు. ఇంట్లో అద్దెకి దిగినవాళ్ళు ఆవిడ కోసం తాము ప్రతి రోజు వండుకునే వంటలో కూర, పచ్చడి, పప్పు, పులుసు మొదలయినవి వేరే తెచ్చివ్వాలి. ఆవిడ అన్నం మాత్రమే వండుకుంటుంది. ఈ పద్ధతి ఎవరికీ నచ్చలేదు. కలిగినవాడు వండుకుంటాం. లేనివాడు కలో గంజో పోసుకొని దినం వెళ్ళబుచ్చుతాం. శాస్త్రప్రకారం ఆవిడకి ప్రతి పూట నాలుగు పదార్థాలు చేసి పెట్టడం చాలా కష్టమయిన పనే. అంతేకాకుండా మేడ మీద వాటాల్లో అద్దెకుంటున్న స్టూడెంట్లు కొంతమంది ఇల్లు చూడ్డానికి శాంత, ఆదిత్యలు వెళ్ళినప్పుడు వెకిలిగా నవ్వడం, వెర్రి వెర్రి షోకులు వెయ్యడం మొదలయిన పనులు చేశారు. ఈ రెండు బాధలకు తట్టుకుంటే ఆ వాటా బాగానే వుంది. అంతకు మించి మరేదీ సరిపడలేదు."

ఇక చిన్నపెట్టిగారి విషయంలో ఇంకా చిక్కులు వచ్చిపడ్డాయి.

ఈనాటి ఆనాటి వాటాలు అయితే అద్దె చాలా హెచ్చుగా వుండడం, చిన్న వాటాలయితే మరీ అన్యాయంగా వుండి కనీసం స్నానానికయినా అనుకూలంగా వుండేవి కావు. ఒక ఇల్లు మాత్రం బడ్డీ దుకాణానికి దగ్గరగా కనిపించింది. ఇంట్లో పెరటి గోడల మీద రేకులు దింపి కట్టించిన ఒక చిన్న షెడ్డు వుంది. అందులో ఎండాకాలం ఎండంతా ఇంట్లోనే వుంటుంది. చలి కాలం చలి కూడా అంతకు మించిపోతుంది. అయితే ఎవరితో సంబంధం లేకుండా స్వతంత్రంగా వుండి స్నానానికీ వాటికి ఆడవాళ్ళకి ఇబ్బంది లేకుండా వున్నది అదొకటే అనిపించింది. అప్పటికింకా వ్యవధి వుండడం చేత ప్రయత్న లోపం లేకుండా వెతుకుతూనే వున్నారు. చివరికి వాళ్ళ అదృష్టం కొలది ఏప్రిల్ నెలాఖరు నాటికి ఆ మూడు వాటాలే స్థిరపరచు కున్నారు.

అందరూ మే ఒకటవ తారీఖు ఉదయం నుంచి వాటాలు ఖాళీ చేయడానికి నిశ్చయించుకున్నారు.

మొట్టమొదట రెండు రిక్షాలు తెప్పించి అందులో చిన్నపెట్టిగారి సామాన్లు ఎక్కించి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న వాళ్ళ వాటాకి చేర్చారు. చిన్నపిల్లలు ముగ్గురూ వెళ్ళలేక వెళ్ళలేక ఏడుస్తూ ఆ ఇల్లు విడిచి వెళ్ళారు. మంగమ్మగారు, ఆదిత్య అమ్మగారు కూడా కళ్ళు తుడుచుకోకుండా వుండలేకపోయారు.

తరువాత తొమ్మిది గంటలకి ఆదిత్య వాళ్ళ సామానులు తీసికెళ్ళడానికి సిద్ధపడ్డారు. ఒకసారి కొన్ని సామానులు తీసుకెళ్ళిన తరువాత ఆదిత్య అమ్మగారిని చాలా శ్రమతో రిక్షా ఎక్కించి అంతకి రెండు రెట్ల శ్రమతో కొత్త ఇంట్లోకి చేర్చారు.

సామాన్లన్నీ పూర్తిగా చేరిన తరువాత రంగారావు గారు, మంగమ్మగారు వాళ్ళతో చెప్పి బయలుదేరుతుంటే మేడ మీద స్టూడెంట్స్ ఒక్కసారి ఈలలు వేసి "హలో డార్లింగ్ ఆదిత్యా!" అని అరిచారు. ఈ పరిస్థితి చూసి రంగారావు గారు, మంగమ్మగారు నిలబడిపోయారు.

ఆదిత్య వాళ్ళవేపు చూస్తూ అంది — "మీరు చూస్తే నలుగురు. నేను ఒక్కదాన్ని. మీలో ఎవరికైనా ధైర్యం వుంటే కిందికి దిగి నన్ను పెళ్ళి చేసుకుంటానంటే సంతోషిస్తాను. లేని పక్షంలో పోలీసు రిపోర్టు ఇస్తాను. ఏది కావాలో చెప్పండి" అంది.

మేడ మీద వాటాలో వాళ్ళేకాక పక్కవాటాలో వాళ్ళు కూడా ఆ మాటలు విని చకితులు అయ్యారు.

ఇంతలో సామాను సర్దుతుంటే ఇంటావిడ తన సంగతి మర్చిపోవద్దని చెప్పింది.

అప్పుడు ఆదిత్య — "[illegible]మ్మగారూ! మేమేమీ కలి[illegible]వాళ్ళం కాదు. ఒక పూట తిని, ఒక పూట పస్తుండి అవసరమయిన ఇంటద్దె మొదలయినవి ఖర్చు పెడుతూ వున్నవాళ్ళము. మీకు కావలసిన కూరలు, పచ్చళ్ళు చేసిపెట్టడానికి నాకేమీ అభ్యంతరం లేదు. కానీ ఒక్క సంగతి. మీ [illegible]చ్చే అద్దెలో నెలకు ఓ అరవై రూపాయలు తీసుకుంటా[illegible]. దానికి మీరు రాజీపడితే మీరు కోరిన విధంగా అన్నీ సప్లై చేస్తాను" అంది.

దాంతో ఇంటావిడ నో[illegible] నొక్కుకొని తన భాగంలోకి వెళ్ళిపోయింది.

రంగారావుగారు, మంగమ్మగారు ఇంటికి వచ్చి సామానులు బం[illegible]లోకి ఎక్కించడం మొదలుపెట్టారు. సుబ్బారావు, [illegible]దిత్య, పెట్టిగారు అందరూ వచ్చి సామాన్లు ఒకటి ఒకటి తీసి ఒంటెద్దు బండిలో ఎక్కించారు. బీరువా, పందిరి మంచం, గ్యాస్ పొయ్యి, బిందెలు మొదలయినవి జాగ్రత్తగా బండిలో సర్ది ఇల్లు ఖాళీ చేసేసరికి పన్నెండున్నరయింది.

మంగమ్మగారు ఇంటి వాళ్ళకి ఇల్లు అప్పచెపుతూ, ఇంటికి దండం పెట్టి అన్నారు — "ఓ గృహదేవతా! నువ్వు మాకు ఎనిమిది సంవత్సరాలై ఆశ్రయమిచ్చావు. పిల్లలు, అల్లుళ్ళు, మనుమలు, చుట్టాలు అందరికీ ఆతిథ్యం ఇచ్చావు. మమ్మల్ని అంతే ఆప్యాయంగా చూడడం చేత నువ్వు మాదానివే అన్న భ్రమలో

## ఆత్మాభిమానము

అవమాన మొనరించి ప్రియభాషణలనెన్ని
చేసినను అప్పోట విలువ నలదయ్యా!!
పరుష వాక్యములాడి పలు బాధలొనరించి
అయ్యో! రానయ్యయని కపటమున పిలుచుటది
వెనుక మేకులుకొట్టి ముందురమ్మనినట్టు
ముందు తలగొరిగి పూలు వెనుక ముడిచిన విధము!!
వెకిలి చేతలు చేసి విద్వత్సభామధ్యమున
వికటముగ రండి, రండనుట లెల్ల
విలువైన వస్త్ర భూషణలొసగి మన్నించి
నాసికాంతము గోసి పసిడి ముక్కిడినట్లు!!
ధనము పోయినను ప్రాణములు పోయినను
ఆత్మాభిమానమును కాపాడుకోవలయు
కర్త శ్రీ విభుడు మన పురందర విఠలుని
భక్తులే లేని స్థానమును విడువగ వలెను!!

## జ్ఞానము-స్నానము

నీటియందున తనువు ముంచ స్నానము కాదు
నీ మనము నిర్మలము కావలయు మనుజుడా!!
దాన ధర్మాదులను చేయుటే స్నానము
జ్ఞాన తత్త్వమతుల తెలియుటే స్నానము
హీన పాపములెల్ల విడుచుటది స్నానము
ధ్యానమున మాధవుని చూచుటయె స్నానము!!
గురు, ఆర్య పాద స్పర్శనమదే స్నానము
జ్ఞాన వృద్ధుల చరణ సేవయే స్నానము
అతిథి అభ్యాగతుల కాదరణ స్నానము
నరహరిని మనమందు నమ్ముటయె స్నానము!!
దుష్ట జన సంగతిని విడుటే స్నానము
శిష్టులను చేరి సేవించుటయె స్నానము
సృష్టియందున శ్రీ పురందర విఠలుని
ముదమార కొలుచుటది విరజా స్నానము!!

కన్నడ మూలం: పురందరదాసులు
తెలుగు అనువాదం: పి. సరస్వతి


☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆



పడిపోయాము. ఇవాళ నిన్ను విడిచి వెళ్ళేటప్పుడు మాకు నువ్వెంత గొప్పదానివో తెలిసి వచ్చింది. తల్లీ మా తప్పులే మేనా వుంటే క్షమించు''

మంగమ్మగారు గడపకు వంగి నమస్కారం చేసి చీర చెంగుతో కళ్ళు ఒత్తుకున్నారు.

తరువాత ఆమె రెండడుగులు వేసి నడిస్తే అశోక వృక్షం నీడ ఆమె మీద పడి చల్లగా అనిపించింది. అప్పుడావిడ ఆ చెట్టుకి కూడా దండం పెట్టి ఇలా అన్నారు— ''ఓ వృక్షదేవతా! నువ్వు గృహ దేవత తరువాత ఆశ్రయమిచ్చిన తల్లివి. నీ నీడలో ఎన్ని పగళ్ళు, ఎన్ని రాత్రుళ్ళు మేము గడిపామో? మా అందరికీ పెద్ద దిక్కువై కాపాడావు. మా అన్నగారు ఒకాయన ఈ నీడలో కూర్చునే రామాయణం రాసుకున్నారు. కానీ, తల్లీ నాకు ఒక్కటే కష్టంగా వుంది. ఈ ఇంటి యజమాని ఇల్లు మార్పుచేస్తూ, నిన్ను కొట్టివేయడానికి నిశ్చయించుకున్నాడు. ఇది మేమెవరం భరించలేనటువంటిది. అందుకోసమే కాబోలు నువ్వు చల్లగా వున్నప్పుడే మేము నిన్ను విడిచి వెళ్ళిపోతున్నాము. తల్లీ మా తప్పులు క్షమించు.''




రంగారావుగారు, తక్కినవాళ్ళందరూ ఆవిడ మాటలు విని నిశ్శబ్దంగా వుండిపోయారు. ఎవరిమానాన వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత రంగారావు దంపతులు నోట మంచి నీళ్ళు కూడా పోసుకోలేదు. నడినెత్తి మీద సూర్యుడు విజృంభించాడు. బండి వెనకాతల వెళ్ళడానికి కూడా శ్రమగానే తోచింది వాళ్ళకి.

మలుపు తిరిగేసరికి నారాయుడి రిక్షా కనిపించింది. రంగారావుగారు జేబులో చూసుకుంటే బండి అద్దెకి సరిపోను ఒక్క రూపాయి మిగిలింది. అతను తువ్వాలు భుజం మీదికి వేసుకొని నడిచారు.

''బాబుగారూ, అమ్మగారూ మీకు ఎనిమిది సంవత్సరాలై రిక్షా అప్పుడప్పుడు కడుతున్నాను. మీరు ఇల్లు మారిపోతున్నారంటే వీధి వీధీ అందరికీ కష్టంగానే వుంది. ఇంత ఎండలో మీరు బండి వెనకాతల నడచి వెళ్ళడం ఏమీ బాగాలేదు. మిమ్మల్ని కొత్తింటికి చేర్చడానికి నాకు అవకాశం ఇవ్వండి'' అన్నాడు నారాయుడు.

రంగారావుగారు ఏదో చెప్పడానికి ప్రయత్నించారు.

''బాబుగారూ! మీరు ఏమీ అనడానికి లేదు. అమ్మగారూ, మీరు ఎక్కిపొండి'' అన్నాడు.

సామాను బండి వెనక దంపతులు కూర్చున్న రిక్షా ముందుకి కదలిపోయింది.

